క్లుప్తంగా

విపక్షాల విమర్శలు నమ్మవద్దు

ఉండ్రాజవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని తాడిపర్రు గ్రామంలో సోమవారం మూడో రోజు ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు గత నాలుగేళ్లలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్‌లెట్స్ ఆందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించడమే ప్రతిపక్ష పార్టీలు పనిగా పెట్టుకున్నాయన్నారు. వారి మాటలను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కరుటూరి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు అక్కిన రామకృష్ణ, బందుల విశ్వేశ్వరుడు, గుమ్మడి ప్రసాద్, బొర్రా వెంకటనారాయణ, కాసకాని లక్ష్మీనారాయణ, చోళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం: జగనన్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఉండ్రాజవరం-1, 3 సచివాలయాల్లో సోమవారం వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యులు చక్రవర్తి, రాంబాబు ఈ శిబిరంలో 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 45 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, కె.కుమారి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'నారాయణ'లో స్టడీ మెటీరియల్ సీజ్



నారాయణ విద్యాసంస్థల్లో విచారణ చేస్తున్న ఎంఈవో గురుమూర్తి

నిడదవోలు: పట్టణంలోని నారాయణ విద్యాసంస్థల్లో అనుమతి లేకుండా విద్యార్థులకు విక్రయిస్తున్న స్టడీ మెటీరియల్ (పాఠ్యపుస్తకాలు)ను విద్యాశాఖాధికారులు సోమవారం సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న పాఠ్య పుస్తకాలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆ విద్యాసంస్థల వద్ద ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎంఈవో గురుమూర్తి అక్కడకు చేరుకుని విచారణ జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నట్టు ఆయన గుర్తించారు. స్కూల్ యాజమాన్యం సొంతంగా ప్రింట్ చేసిన పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు విక్రయిస్తున్నట్టు ఎంఈఓ నిర్ధారించుకున్నారు. దాంతో రూ.50 వేల విలువైన పాఠ్య పుస్తకాలను సీజ్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, వారి ఆదేశాల మేరకు స్కూల్ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకుంటామని ఎంఈవో గురుమూర్తి తెలిపారు.

శాకంబరిగా బాలాత్రిపుర సుందరీదేవి



శాకంబరిగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు

ఉండ్రాజవరం: ఆషాఢ మాసం, గురు పూర్ణిమ సందర్భంగా మండలంలోని పాలంగి గ్రామంలో కొలువైన శ్రీరామలింగేశ్వర స్వామి వారికి సోమవారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగా బాలా త్రిపుర సుందరీ దేవి అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని 150 కేజీల వివిధ రకాల కూరగాయాలతో అలకరించారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి దంపతులు, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దొడ్డా సూర్యనారాయణ, ఆలయ ఈవో ఎంవీ రామయ్య, కమిటీ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

తాతపై మనవడి దాడి

ఉండ్రాజవరం: అడిగిన సొమ్ము ఇవ్వలేదనే కోపంతో ఓ యువకుడు తన తాతపై దాడి చేసి గాయపరిచాడు. పోలీసుల కథనం ప్రకారం ఉండ్రాజవరంలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రామకృష్ణ కాలనీకి చెందిన తేటకాల చైతన్యకృష్ణ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. అతడు తన తాత అయిన తేటకాల రామారావు వద్దకు వెళ్లి తాను వివాహం చేసుకోదలిచానని, అందుకు రూ.ఐదు లక్షలు ఇవ్వాల్సిందిగా కోరాడు. మనవడి అలవాట్ల గురించి తెలిసిన రామారావు సొమ్ము ఇచ్చేందుకు నిరాకరించాడు. ఈ క్రమంలో తాతామనవళ్ల మధ్య కొంత వాగ్వాదం జరిగింది. ఒక దశలో ఆగ్రహం చెందిన చైతన్యకృష్ణ కర్ర తీసుకుని రామారావును కొట్టాడు. గాయపడిన రామారావును తన మనవడిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో ఎస్సై కె.రామారావు సోమవారం చైతన్య కృష్ణను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు.

బోర్ల కింద ముమ్మరంగా వరినాట్లు

- ఇప్పటికి 430 ఎకరాల్లో పూర్తి
- అనుకూలించని వాతావరణం
- ముందస్తు సాగుకు ఆటంకం
- వర్షాల కోసం రైతుల నిరీక్షణ



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో బోర్ల కింద వేస్తున్న వరి నాట్లు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో బోర్ల సాయంతో ఖరీఫ్ వరిసాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వారం రోజులుగా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. దాదాపు 80 శాతం వరి పంట బోర్ల కింద సాగవుతోంది. ఈ నెలాఖరుకు 90 శాతం వరినాట్లు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే వాతావరణం అనుకూలించక పోవడంతో చెరువులు, తాడిపూడి కాలువ ఆయకట్టు భూముల్లో మాత్రం వరి నాట్లు ఇంకా ప్రారంభం కాలేదు. బోర్ల నీటి సాయంతో రైతులు నారు పోసి సిద్ధం చేశారు. వాతావరణం అనుకూలించి వర్షాలు పడితే చెరువులు, కాలువ ఆయకట్టు భూముల్లో వరినాట్లు వేయాలని వారు భావిస్తున్నారు.

29,544 ఎకరాల సాధారణ విస్తీర్ణం

మెట్ట ప్రాంతంలోని గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, ద్వారకా తిరుమల మండలాల్లో ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 29,544 ఎకరాలు. సాధారణంగా ఏటా జూలై 15 నాటికి 70 శాతం వరినాట్లు పడేవి. ఈ ఏడాది ఇప్పటి వరకూ కేవలం 430 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. మరో పది రోజుల్లో బోర్ల కింద నాట్లు పూర్తికానున్నాయి. దేవరపల్లి మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 9,000 ఎకరాలు కాగా, ఇప్పటి వరకూ 220 ఎకరాల్లో నాట్లు వేశారు. గోపాలపురం మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 10280 ఎకరాలు కాగా, 100 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. నల్లజర్ల మండలంలో సాధారణ విస్తీర్ణం 5400 ఎకరాలు కాగా, 90 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ద్వారకాతిరుమల మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 4,864 ఎకరాలు కాగా, 20 ఎకరాల్లో నాట్లు వేశారు.

సాగు చేస్తున్న వంగడాలివే..

నియోజకవర్గంలో అధిక దిగుబడులు వచ్చే వరి వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు పీఎల్‌ఏ-1100, 1061, సంపత్ స్వర్ణ రకాలను సాగు చేస్తున్నారు. పీఎల్‌ఏ-1100 రకం వంగడాన్ని 90 శాతం మంది రైతులు సాగు చేస్తున్నారు. నల్లజర్ల మండలంలో సంపత్ స్వర్ణ రకం వంగడాన్ని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సొసైటీల ద్వారా సరఫరా చేసింది. ముందస్తు ఖరీఫ్ సాగును దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్‌లోనే విత్తనాలను సొసైటీల వద్ద ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. దేవరపల్లి మండలంలో త్యాజంపూడి, సూర్యనారాయణపురం, సంగాయగూడెం, గౌరీపట్నం ప్రాంతాల్లో నాట్లు ముమ్మరంగా జరుగుతున్నట్టు ఏవో కె. విజయ్ తెలిపారు.



యర్నగూడెంలో బోరు కింద వేసిన వరి నారుమడి

ముందస్తు సాగుకు వాతావరణం ఆటంకం



ముందస్తు ఖరీఫ్ వరి సాగుకు వాతావరణం ఆటంకంగా మారింది. ఇప్పటికే జూలై మొదటి వారం ప్రవేశించింది. ఇంత వరకూ మెట్ట ప్రాంతంలో ఎక్కడా వర్షం కురవలేదు. ఈ కారణంగా నాట్లు ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. సాధారణంగా జూలై 10 నాటికి 70 శాతం నాట్లు పడేవి. ప్రస్తుతం నియోజకవర్గంలో 250 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. ఎండల తీవ్రత, వడగాడ్పులు ఎక్కువగా ఉండడంతో ఆకుమడుల మొలకలు ఎండిపోతున్నాయి. బోర్ల కింద మాత్రం నారు సిద్ధంగా ఉంది. దాదాపు 20 రోజులు నాట్లు ఆలస్యం అయ్యాయి. ఈ ప్రభావం దిగుబడులు, చీడపీడలపై పడుతుంది.

– కమల్‌రాజ్, వ్యవసాయాధికారి, నల్లజర్ల

హమ్మయ్యా.. చినుకులు పడ్డాయి



కొవ్వూరులో కురిసిన వర్షం

కొవ్వూరు: సోమవారం ఉదయం నుంచీ ఎండ మండిపోయింది. ఎండ వేడికి ఉక్కపోత తోడవడంతో కొవ్వూరు పట్టణ వాసులు అల్లాడిపోయారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆకాశం మేఘావృతమైంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన చిరు జల్లులు పడ్డాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్తు సరఫరాకు సుమారు మూడు గంటలకు పైగా అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు జరిపి సరఫరాను పునరుద్ధరించారు. స్థానిక నందమూరు రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినడంతో పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గత వారం రోజులుగా ఎండ వేడిమికి అల్లాడుతున్న జనానికి సోమవారం సాయంత్రం పడిన జల్లులు కాస్త ఉపశమనం కలిగించాయి. ఆకాశం మేఘావృతమై ఉంది.

ఎంఈఓ-1గా సక్సేనా రాజు



సక్సేనా రాజును అభినందిస్తున్న ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు



నల్లజర్ల ఎంఈఓ-2 సత్యనారాయణను కలిసిన డీటీఎఫ్ నాయకులు

ఉండ్రాజవరం: మండల విద్యాశాఖాధికారి-1గా సీహెచ్ సక్సేనారాజు సోమవారం ఉండ్రాజవరంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకూ పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడులోని గవర్నమెంట్ ఉన్నత పాఠశాల (పోస్ట్ బేసిక్ స్కూల్) గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించే వారు. పదోన్నతిపై ఉండ్రాజవరం ఎంఈవో-1గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన పీవీఎస్ నాగరాజు పాలకోడేరుకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం మండల విద్యాశాఖాధికారి-2గా డి.శారదా జ్యోత్స్న విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సక్సేనా రాజును కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు కలిసి అభినందించారు.

నిడదవోలు ఎంఈఓ-1గా గణేష్

నిడదవోలు రూరల్: నిడదవోలు రూరల్ ఎంఈఓ-1గా కేఎస్‌వీ గణేష్ సమిశ్రగూడెం ఎంఈఓ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చింతలపూడి హైస్కూలు హెచ్‌ఎంగా పనిచేసిన గణేష్ ఎంఈఓగా పదోన్నతి పొందారు. గణేష్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సీఆర్పీలు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.



కేఎస్‌వీ గణేష్

నల్లజర్ల ఎంఈఓగా సత్యనారాయణ

నల్లజర్ల: నల్లజర్ల ఎంఈఓ-1గా యర్రోజు సత్యనారాయణ నియమితులయ్యారు. తాళ్లపూడి మండలం, వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడ ఎంఈఓ సోమవారం నియమితులయ్యారు.ఆయనను డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొణతం నరహరి, జిల్లా అధ్యక్షుడు పి. శేషబ్రహ్మం, జిల్లా కార్యదర్శి కె.అప్పలాచారి, సంఘ నాయకులు కలసి అభినందించారు.

డిజిటల్ విద్యకు ప్రభుత్వం పెద్దపీట

- ఏఎంఓ గౌరీశంకరరావు
- ప్రకాశరావుపాలెంలో ఉపాధ్యాయుల శిక్షణ ప్రారంభం

నల్లజర్ల: డిజిటల్ విద్యా విధానానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) కె.గౌరీశంకర్రావు అన్నారు. డిజిటల్ టెక్నాలజీపై నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లోని ఉపాధ్యాయలకు శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు రెండు రోజుల చొప్పున మొత్తం రెండు వారాల పాటు ఈ శిక్షణ సాగుతుంది. ఈ శిక్షణ శిబిరాన్ని సోమవారం ఉదయం ప్రకాశరావుపాలెంలోని వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో గౌరీశంకర్రావు ప్రారంభించారు. ఎంఈఓ-1 జి. శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎంఓ మాట్లాడుతూ విద్యలో వినూత్న, విప్లవాత్మక మార్పులను డిజిటల్ టెక్నాలజీ తీసుకువస్తుందన్నారు. గతేడాది 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్స్ ఇవ్వడం ద్వారా డిజిటల్ టెక్నాలజీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ఏడాది ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వాటిని ఏ విధంగా వినియోగించి విద్యార్థులకు డిజిటల్ విద్య అందించాలనే అంశంపై ఉపాధ్యాయులకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. 361 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. రీసోర్సు పర్సన్లుగా వైజ్ కళాశాల లెక్చరర్ నోముల కొండయ్యతో పాటు 8 మంది లెక్చరర్లు వ్యవహరిస్తున్నారు. కళాశాల కరస్పాండెంట్ ఆకుల త్రిమూర్తి, ప్రిన్సిపాల్ ఎం.అరవింద కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఏఎంఓ గౌరీశంకరరావు

నిర్లక్ష్యానికి గురైన పల్లెల అభివృద్ధి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తాళ్లపాలెంలో జల్‌జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన
- రోడ్లు, డ్రైన్ల ప్రారంభం, ఓటీఎస్ పత్రాల పంపిణీ

నిడదవోలు రూరల్: దీర్ఘకాలంగా నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను అభివృద్ధి చేసి నియోజకవర్గ రూపురేఖలు సమూలంగా మారుస్తున్నామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా మండలంలోని తాళ్లపాలెంలో రూ.46.85 లక్షలతో నిర్మించే 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్, తాగునీటి కుళాయిలు, పైపులైన్ పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేసి శిలా ఫలకాలను ఆవిష్కరించారు. అలాగే ఆ గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించిన సీసీ, గ్రావెల్ రోడ్లు, సీసీ డ్రైన్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.78.19 కోట్ల వ్యయంతో జల్‌జీవన్‌మిషన్ కింద పనులు చేపడుతున్నామన్నారు. రానున్న ఆరు నెలల్లోనే వాటిని పూర్తిచేసే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలోని 10 మంది లబ్ధిదారులకు ఓటీఎస్ పత్రాలను అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు గంధం వెంకటరత్నం, ఎంపీడీఓ పి.శామ్యేలు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.శ్రీనివాస్‌బాబు, ఏఈ కె.శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ శంకుస్థాపన శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

అమ్మ ఒడి పథకం ప్రారంభం

పెరవలి: విద్యా రంగంలో వినూత్న మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని ఖండవల్లి హైస్కూల్లో అమ్మ ఒడి పథకాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల తల్లుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని 21 వేల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు ఈ ఏడాది రూ. 31.76 కోట్ల నిధులు జమ చేశారని చెప్పారు. అనంతరం ఈ ఏడాది టెన్త్ పరీక్ష ఫలితాల్లో మొదటి స్థానాల్లో నిలిచిన ఖండవల్లి, ముక్కామల, మల్లేశ్వరం, అన్నవరప్పాడు హైస్కూళ్ల విద్యార్థుల తల్లిదండ్రులకు ఆణిముత్యాలు పథకం కింద ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారు. ఖండవల్లి గ్రామంలో రూ.5.02 కోట్ల వ్యయంతో నిర్మించే వాటర్ ట్యాంక్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షులు వీరమళ్ళ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు, సేవలకు అర్హతే ప్రామాణికం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- నెహ్రూ నగర్-2 లో 200 మందికి ధ్రువీకరణ పత్రాల పంపిణీ
- 'జగనన్న సురక్ష' శిబిరాలకు అనూహ్య స్పందన

నిడదవోలు: అర్హులందరికీ పక్కాగా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు సూచించారు. జగనన్న సురక్ష శిబిరాన్ని సోమవారం ఆయన పట్టణంలోని నెహ్రూనగర్ -2 వార్డు సచివాలయంలో ప్రారంభించారు. శిబిరంలో అర్హులకు ఆయన 200 మందికి కుల, నివాస, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ, బియ్యం కార్డులు పంపిణీ చేశారు. అలాగే 20 మందికి ఆధార్ లింకేజీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులకు నూరు శాతం సంక్షేమ పథకాలు, సేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, జేసీఎస్ కన్వీనర్ ఎస్‌కే చాన్‌బాషా, కౌన్సిలర్లు మానుపాటి లక్ష్మి, కామిశెట్టి సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, ఎండీ షకీరాబేగం, దాకే అనిల్‌కుమార్, అహ్మదున్నీసాబేగం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



నిడదవోలులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

చాగల్లు: మండలంలోని మార్కొండపాడు, కలవలపల్లి, మల్లవరం, గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం సర్వే నిర్వహించారు. ఎంపీడీవో బి.రాంప్రసాద్, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు ఆయా గ్రామాల వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సోమవారం ఇంటింటికీ వెళ్లి, అర్హులై ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందడం లేదా? అని ఆరా తీశారు. ఎవరికైనా జనన, మరణ, కుల, ఆదాయ వంటి ధ్రువ పత్రాల్లో ఏవైనా కావాలా అడిగి తెలుసుకున్నారు.

నేడు రెండు గ్రామాల్లో..

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం, పెండ్యాల గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యేలు సోమవారం తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు జగనన్న సురక్ష సర్వేలో నమోదు చేసిన వినతులకు మంగళవారం అధికారులు పరిష్కారం చూపనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

బీసీ సెల్ మండల కమిటీల ఏర్పాటు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ బీసీ విభాగం మండల కమిటీలను నియమిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు సోమవారం తెలిపారు. నియోజకవర్గాల్లో పర్యటించి ఆయా శాసనసభ్యులను కలిసి మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గోపాలపురం, అనపర్తి నియోకవర్గాల్లో కమిటీల నియామకం పూర్తయినట్టు చెప్పారు. మిగిలిన నియోజకవర్గాల్లో ఈ నెలాఖరుకు కమిటీల నియామకాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.

స్కూల్‌ను కొనసాగించాలి

నల్లజర్ల: సుభద్రపాలెంలో పాఠశాలను కొనసాగించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఆ గ్రామ సచివాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ గ్రామంలో 1943 నుంచి సీఎస్‌ఐ ఎయిడెడ్ పాఠశాల కొనసాగుతోంది. ఇటీవల ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు టీచర్లను వేరేచోటకు బదిలీ చేశారు. ఈ పాఠశాలను ఎత్తివేసి పక్క గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో విలీనం చేస్తారని వదంతులు వచ్చాయి. ప్రస్తుతం 80 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి ముగ్గురు ఉపాధ్యాయులు అవసరం. ఎయిడెడ్ పాఠశాలను ఎత్తివేసినా ప్రాథమిక పాఠశాలగా అనుమతించి కొనసాగించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ సచివాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈవిషయం తెలుసుకున్న ఎంఈఓ-2 భగవతీదేవి ఆ గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. వారు కోరిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

నేడు రంగా,కృష్ణదేవరాయల విగ్రహాల ఆవిష్కరణ

కొవ్వూరు: ఐ.పంగిడిలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు కాపు ఉద్యమ నేత వంగవీటి మోహన్‌రంగా, శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాలను ఆవిష్కరించనున్నట్టు చౌటుపల్లి సాంబశివరావు (శివ) తెలిపారు. ఈ కార్యక్రమానికి రంగా కుమారుడు రాధాకృష్ణ, కాపు సంఘం నేత దాసరి రాము, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కరాటం రాంబాబులతో పాటు పలువురు కాపు సంఘ నేతలు హాజరు కానున్నట్టు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి పూజలు



దేవరపల్లిలో షిర్డీ సాయికి గోదావరి జలాలతో అభిషేకం



పెద్దేవం సాయిబాబా గుడిలో మంత్రి వనిత తదితరుల పూజలు



తాళ్లపూడిలోని సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకం

దేవరపల్లి: గురుపౌర్ణిమ వేడుకలను పలు ప్రాంతాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక షిర్డీ సాయి మందిరంలో బాబాకు సోమవారం విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము 4 గంటలకు కాకడహారతి, నగర సంకీర్తన, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం బాబావారి మూలవిరాట్‌కు 108 లీటర్ల ఆవుపాలు, 108 కలశాల పవిత్ర గోదావరి జలాలతో అష్టోత్తర కలశాభిషేకం, లక్ష బిల్వార్చన, పంచహారతులు ఇచ్చారు. 108 రకాల పిండివంటలను స్వామి వారికి నివేదన చేశారు. షిరిడీ సాయినాథ్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అన్నసమారాధన నిర్వహించారు.

బాబా గుడిలో మంత్రి వనిత పూజలు

తాళ్లపూడి: గురుపౌర్ణమి సందర్భంగా రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పెద్దేవం గ్రామంలోని విజయ సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు. హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు, అర్చకుడు మంత్రి వనితకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమెను సత్కరించారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, పార్టీ జిల్లా కార్యదర్శి తోట రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి అబ్బులు, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని తాళ్లపూడి, పెద్దేవం, వేగేశ్వరపురం, గజ్జరం, అన్నదేవరపేట గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తాళ్లపూడిలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో గల సాయిబాబాకు అర్చకుడు చేబ్రోలు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం, అన్నాభిషేకం, సుగంధ ద్రవ్యాల అభిషేకాలు, హోమం, పల్లకీ సేవ, కాకడ హారతి, సేజ్ హారతి, సంధ్యాహారతి నిర్వహించారు. అనంతరం ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. మండల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు తదితరులు బాబాకు పూజలు చేశారు. వేగేశ్వరపురంలోని బాబా ఆలయంలో అర్చకుడు పెరవలి సత్యప్రసాద్, సాయిల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, సహస్ర తులసి పూజలు చేశారు. పెద్దేవంలోని విజయ సాయిబాబా ఆలయంలోని అభిషేకాల అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: స్థానిక షిరిడీ సాయిబాబా, దత్తసాయి మందిరాల్లో బాబాకు పంచామృత పాలాభిషేకం నిర్వహించారు.ఆలయ కమిటీలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రాహ్మణగూడెం ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలకరించారు. స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. అన్నసమారాధన చేశారు. చాగల్లు, ఊనగట్ల తదితర గ్రామాల సాయిబాబా ఆలయాల్లో ఉదయం నుంచి కాకడహారతి, పంచామృతాలు, పండ్లరసాలతో అభిషేకాలు జరిగాయి. 1001 బూరెలతో నివేదన, సహస్ర పుష్పార్చన, సంధ్యా హారతి, బాబా పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు.

నిడదవోలు రూరల్: తాడిమళ్ల గ్రామంలోని నాగసాయిబాబాకు పంచామృతాభిషేకాలు, వైదిక సూక్త విశేష పూజలు జరిపించారు. వివిధ అలంకార విశేష హారతులతో, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు తాతిరాజు సుబ్రహ్మణ్యం, కాగిత రామారావు, తాడిమళ్ల రామశేషు, ప్రధానార్చకుడు కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.